

అమెరికా పర్యటన వ్యక్తిగతం : డీసీఎం

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని, అక్కడ ఏ నేతలను భేటీ కావడం లేదని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. ఆదివారం డీసీఎం కుటుంబ సభ్యులతో కలసి అమెరి కా పర్యటనకు బయల్దేరారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడు తూ అమెరికాకు వెళ్తున్న విషయం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కు లేఖ రాశానన్నారు. ఈనెల 8న వాషింగ్టన్‌కు వెళ్తున్నానని, 16న తిరిగి వస్తా అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా, ప్రస్తుతం పోటీ చేస్తున్న కమలా హా రిస్‌తో భేటీ అవుతారని సోషల్‌మీడియాలో ప్రచారమైన నేపథ్యంలో వివరణ ఇచ్చారు.



విష్ణుమూర్తి రూపంలో వినాయకుడు



శివలింగంతో వినాయకుడు



రాఘవేంద్ర స్వామి నమూనాలో వినాయకుడు



పర్యావరణ గణనాథుడికి పూజలు



వ్యాసమహర్షి సమేతంగా వినాయకుడు



జేపీ నగర్ సత్యగణపతి ఆలయంలో అలంకరణ



ఆంజనేయసమేత గణనాథుడు



సత్యగణపతికి వెండి కవచంతో అలంకరణ

కొలువుదీరిన గణనాథుడు

- ఆకట్టుకున్న వినాయకుడి విగ్రహాలు
- మండపాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు



ముళబాగిలు వద్ద కురుడుమలె ఆలయంలో వినాయకుడు

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని నగరంలోని వేలాది ప్రాంతాల్లో గణనాథుడు కొలువుదీరాడు. శనివారం ప్రతిష్ఠించిన గణప తులను కొన్ని ప్రాంతాలలో సాయంత్రం నిమజ్జనం చేయగా మరికొన్ని ప్రాంతాల్లో 3, 5, 7 రోజులపాటు కొనసాగించనున్నారు. బెంగళూరులో భిన్నమైన సంప్రదాయం ఉంది. వినాయక చవితిరోజునే కాకుండా సుమారు నెలరోజులపాటు నగర వ్యాప్తంగా మండపా లను ఏర్పాటు చేసి గణేశ ఉత్సవాలు కొనసాగిస్తారు. మరికొన్ని సంఘాలు ఉదయం ప్రతి ష్ఠించి సాయంత్రం నిమజ్జనం చేస్తాయి. ఇలా నెలరోజులపాటు వినాయక సంబరం కొన సాగుతుంటుంది. చవితిరోజు ప్రతిష్ఠించిన వినాయకులకు మూడు రోజులపాటు విశేషపూ జలు చేస్తారు. ఆదివారం పలు మండపాల వద్ద అన్నదానం, సాయంత్రం సంగీత కార్యక్ర మాలు ఏర్పాటు చేశారు. బెంగళూరు గణేశ ఉత్సవలో భాగంగా శృంగేరి శారదామఠంలో ప్రత్యేకంగా కొలువుదీర్చారు. ఇక్కడ ప్రతిరోజూ సంగీత విభావరి తోపాటు ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహిస్తారు. బసవనగుడి ప్రాంతం దొడ్డగణేశ ఆలయంలో నిరంతర పూజలు కొనసాగాయి. కబ్బన్‌పేటలో వీధికో భిన్నమైన గణపతి ఏర్పాటు చేశారు. రాఘవేంద్ర స్వామి నమూనాలోనూ, వ్యాసమహర్షి సమేత గణపతి, విష్ణుమూర్తి ఆకారంలోనూ, పర్యా వరణ గణపతి, విశ్వంభర గణపతి ఇలా భిన్న రూపాలలో వినాయకుడిని కొలువుదీర్చారు. జేపీనగర్ పుట్టేనహళ్లిలోని సత్యగణపతి ఆలయంలో మొక్కజొన్న, టెంకాయలు, చెరుకుగ డలు, వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ ట్రస్టీ రామ్‌మోహన్ రాజ్ మాట్లాడుతూ అలంకరణకు వినియోగించిన ప్రతి వస్తువును భక్తులకు ప్రసాద రూపంలో వినియోగించనున్నట్టు తెలిపారు.



సత్య గణ పతిని దర్శించు కుంటున్న భక్తులు

సువర్ణసౌధను సందర్శించిన రువాండా హైకమిషనర్

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెళగావిలోని సువర్ణ సౌధను రువాండా దేశం హైకమిషనర్ జాక్వెలిన్ ముకంజిరా సందర్శించారు. ఆదివారం సువర్ణసౌధకు చేరుకున్న హై కమిషనర్‌ను జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సతీశ్‌జార్కిహోళి సాదరంగా స్వాగతించారు. అనంతరం సువర్ణసౌధలోని శాసనసభ, విధానపరిషత్ విభాగాలను సందర్శించారు. వాటి పనితీరును మంత్రి తెలిపారు. ప్రతిఏటా శీతాకాల శాసన సభ సమావేశాలు బెళగావిలో జరుగుతాయని, మిగిలిన అన్ని సమావేశాలు రాష్ట్ర రాజధాని బెంగళూరు విధానసౌధలో కొనసాగుతాయని మంత్రి వివరించారు. ప్రజాపనులశాఖ చీఫ్ ఇంజనీర్ హెచ్. సురేశ్, అదనపు జిల్లాఅధికారి విజయ్‌కుమార్ హొనకెరెతోపాటు పలువురు ఉన్నారు.




రువాండా హైకమిషనర్‌ను స్వాగతిస్తున్న మంత్రి సతీశ్ జార్కిహోళి

చాముండి కొండలు యథాతథం

- ఆలయ స్థిరచరాస్తుల మార్పు వద్దు
- ప్రభుత్వ నిర్ణయానికి హైకోర్టులో చుక్కెదురు

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మైసూరు చాముండి కొండల అభివృద్ధి ప్రాధికార పేరిట ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మైసూరు రాజవంశస్తులు రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్ అభ్యంతరం తెలపడంతో వివాదం చెలరేగింది. గతంలోనూ మైసూరు సంస్థానానికి సంబంధించి ఆస్తులు, ఆలయం విషయంలో గందరగోళం కొనసాగింది. అదే పరిస్థితి తాజాగా తెరపైకి రావడంతో రాజవంశ నిర్ణయానికి కోర్టు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో ప్రభుత్వానికి చాముండి కొండల విషయంలో చుక్కెదురైంది. చాముండేశ్వరి ప్రాంతం యాజమాన్యంపై రెండు దశాబ్దాలుగా కోర్టులో వివాదం సాగుతోంది. రాజకుటుంబం 2004లో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. తర్వాత వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివాదం కోర్టులో కొనసాగుతుండగానే ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి చాముండి అభివృద్ధి ప్రాధికార ఏర్పాటు చేసింది. ప్రాధికార ఏర్పాటు, కర్ణాటక శాసనసభ నిర్ణయం నియమం 81, 161లకు వ్యతిరేకమని రాజకుటుంబం అభ్యంతరం తెలిపింది. 2024 ఫిబ్రవరి 19న బిల్లు ప్రవేశపెట్టి 21న తీర్మానించారు. బిల్లుపై చర్చ జరపకుండానే ఆమోదించారని, అది చెల్లదని రాజ కుటుంబం వ్యతిరేకించింది. ఇదే విషయమై హైకోర్టును ఆశ్రయించడంతో రెండురోజుల కిందట చాముండేశ్వరి కొండలకు సంబంధించి యథాస్థితిని కొనసాగించాలని ఆదేశించింది. ఆలయానికి సంబంధించి స్థిరచరాస్తుల విషయంలో నిర్ణయాలు తీసుకోరాదని సూచించింది. దాదాపు ఏడాది కాలంగా కోర్టులో కొనసాగుతున్న వివాదంపై బిల్లు తీసుకొచ్చేముందు ప్రభుత్వం కోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉండేదని సూచించింది. హడావిడిగా ప్రాధికార ఏర్పాటు చేయడం, కోర్టుకు గౌరవం ఇవ్వనట్టుగా ఉందని ధర్మాసనం పేర్కొంది. ప్రాధికార ఏర్పాటుతో ఆలయ సంప్రదాయాలలో ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్టు అవుతుందని రాజకుటుంబం పేర్కొంది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దేవదాస్ వాదనల్లో రాజ్యాంగం 212 నిబంధన కింద ప్రభుత్వానికి అధికారం ఉందని, ప్రాధికారపై అభ్యంతరాలు ఉంటే ప్రశ్నించవచ్చు అన్నారు. చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార తొలి సమావేశం మంగళవారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన విషయం తెలిసిందే. సభకు రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్, యువరాజు, ఎంపీ యదువీర్‌కు ఆహ్వానించినా వారు గైర్హాజరయ్యారు. పైగా కోర్టు అభ్యంతరం తెలిపినా సమావేశం నిర్వహించడాన్ని తప్పుబట్టారు. ఇలా సాగుతుండగానే కోర్టులో రాజవంశానికి అనుకూలమైన నిర్ణయం వచ్చింది. ఈనెల 25కు కేసు వాయిదా పడింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ రాజకుటుంబానికి, ప్రభుత్వానికి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. అదే విధానం మరోసారి తెరపైకి వచ్చింది.



చాముండి కొండలు



మేరీమాతకు సీఎం పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులు

ముగిసిన మేరీ మాత ఉత్సవాలు

- హాజరైన ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- బసిలికా చర్చికి రూ.5 కోట్లు కేటాయిస్తామని హామీ



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న ఆర్చ్‌బిషప్ డాక్టర్ పీటర్ మచాడో

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాజీనగర్‌లో వెలసిన సెయింట్ మేరీ బసిలికా ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆగస్టు చివరిలో ప్రారంభమైన మేరీ మాత ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. సెయింట్ మేరీ బసిలికా చర్చ్‌ఫాదర్ ప్రతిరోజూ బైబిల్ సందేశాలను వినిపించారు. ఆదివారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే సందడి నెలకొంది. బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సాయంత్రం ముగింపు వేడుకల్లో సీఎం సిద్దరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కపట ద్వేషంతో మహనీయుల మానవత్వపు ఆశయాలను బలి చేయరాదన్నారు. కర్ణాటక రాష్ట్రం కువెంపు, అంబేడ్కర్, బసవణ్ణల నైతిక విలువలకు కొలువై ఉందన్నారు. సమాజంలో పరస్పర స్నేహభావం, సౌహార్దత కొనసాగించుకోవాలన్నారు. ఆరోగ్యం, విద్యరంగంలో క్రైస్తవ సంస్థల సేవలు అభినందనీయమన్నారు. బసిలికా చర్చి పునరుజ్జీవనం కోసం రూ.5 కోట్లు కేటాయిస్తామని సీఎం ప్రకటించారు. ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మచాడోతోపాటు శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ పాల్గొన్నారు.

నటుడు దర్శన్‌ను కలిసిన భార్య

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8 : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీ నటుడు దర్శన్‌ను బళ్లారి సెంట్రల్ జైలులో ఆయన భార్య విజయలక్ష్మి శనివారం కలిశారు. విజయలక్ష్మి రాక ముందే వారి న్యాయవాది జైలుకు చేరుకున్నారు. అనంతరం విజయలక్ష్మి కారులో వచ్చారు. దర్శన్‌కు సంబంధించిన రెండు బ్యాగుల్లో దుస్తులు, డ్రైఫ్రూట్స్, టూత్ బ్రష్, పేస్ట్ తెచ్చారు. జైలులోని సెక్యూరిటీ చెక్‌రూమ్‌లో బ్యాగును పరిశీలించిన అనంతరం ఆమె దర్శన్ గదిలోకి వెళ్లారు.

భద్రతను పరిశీలించిన డీఐజీ

నటుడు దర్శన్‌ను శనివారం ఉదయం బళ్లారి సెంట్రల్ జైలులో నార్త్ జోన్ జైళ్లశాఖ డీఐజీ పీటీ శేష కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నటుడు దర్శన్‌ను బళ్లారి జైలుకు తరలించిన నేపథ్యంలో ఆయన సెల్‌కు ఏర్పాటు చేసిన భద్రతను పరిశీలించేందుకు వచ్చానని చెప్పారు. హై సెక్యూరిటీ ఏర్పాటు చేశామని, మూడు 360 డిగ్రీ కెమెరాలు ఉన్నాయని ఆయన వివరించారు. కేవలం రక్త సంబంధీకులు, న్యాయవాదులను మాత్రమే అనుమతిస్తున్నామని తెలిపారు.



దర్శన్‌ను కలవడానికి వెళుతున్న భార్య విజయలక్ష్మి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,623.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	34,983	1629
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	34,743	9,877
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	71.33

గ్రామ నాటకోత్సవం ప్రశంసనీయం



డోలు వాయించి నాటకాన్ని ప్రారంభిస్తున్న రామలింగప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8: కప్పగల్లు గ్రామవాసులు నాటకోత్స వంపై చూపిస్తున్న ఆసక్తి అభినందనీయమని ఆ గ్రామ పంచాయితీ మాజీ ఉపాధ్యక్షుడు రామలింగప్ప అభిప్రాయపడ్డారు. కప్పగల్లు గ్రామంలో సెప్టెంబర్ 5నుంచి 8వ తేది వరకు జరుగుతున్న నాటకోత్సవాల ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు, కూలీలు, ఇతర గ్రామీణ వృత్తుల వారు నాటకం నేర్చుకోవడానికి చాలా ఉత్సాహంగా ముందుకువస్తారని, అందుకనే ప్రదర్శనకు అయ్యేఖర్చులు భరించి నేటికీ నాటకాలు ప్రదర్శిస్తే కళలు వృద్ధిచెందుతాయని రంగతోరణ సంస్థ గత ఏడాది కాలంగా ఇక్కడ నాటకాలను నిర్వహిస్తోందన్నారు. ఒక్కో నాటకానికి ఒక్కొక్కరి నుంచి రూ.100-150 టికెట్ల ధరగా వసూలు చేస్తున్నారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ మాజీ అధ్యక్షుడు బసవన గౌడ, విశ్రాంత అధికారి కట్టెగౌడ, గ్రామనాయకులు ద్యావన్న, కోరిబసప్ప, ఉప్పర బసవరాజు, గోవిందప్ప, వీరేశ్, ప్రముఖ కళాకారిణి పద్మశ్రీ మంజమ్మజోగతి నాటికను వీక్షించేందుకు వచ్చారు. చిన్నపాటి వర్షం కురిసి ఇబ్బందిపెట్టినా కదలకుండా పూర్తిస్థాయిలో గ్రామస్థులు నాటకాన్ని వీక్షించడం గమనార్హం.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కంప్లి, సెప్టెంబరు 8 : కొత్త దరోజీ గ్రామంలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు ఘనంగా చేపట్టారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు కలసిపోయి ఆటలు ఆడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు గీత మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చేసే బోధన జీవితంలో గుర్తుండిపోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఎంత స్థాయికి ఎదిగినా వారి విద్యాబోధన గుర్తుండిపోతుందని తెలిపారు. ప్రతి ఇంట పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు.

పాఠశాల సమితి అధ్యక్షుడికి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, సెప్టెంబరు 8: కంప్లి తాలుకా పరిధిలోని ప్రభు క్యాంపు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షులు నాగరాజును ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందించి సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ.. నాగరాజు పాఠశాల అభివృద్ధి చేపట్టి గుర్తుండిపోయారన్నారు. ప్రతి ఒక్క పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు డీవో సిద్ధలింగ మూర్తి, ఈవో శ్రీకుమార్, హనుమంతప్ప, దొడ్డ బసవ, నాగన్న గౌడ, వీరేష్, నారాయణప్ప, చెన్న బసమ్మ, మల్లన్నగౌడ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి

కంప్లి పట్టణంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. కంప్లి పట్టణంలో పలుచోట్ల మండపాల్లో వినాయకుడిని కూర్చోబెట్టి సంబరాలు చేసుకుంటున్నారు. కొత్త బస్టాండు అంబేద్కర్ సర్కిల్, కాకతీయ నగర్, పలుచోట్ల వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సుమారు పట్టణంలో 63 ప్రాంతాల్లో, గ్రామాల్లో 72 చోట్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు కూడా చేపడుతున్నారు.

నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా

బళ్లారిలో వాడవాడలా వేడుకగా వినాయక చవితి పూజలు

ఎంజీ రోడ్డులో



అయోధ్య రాముడి నమూనాలో పూజలందుకున్న లంబోదరుడు

మిల్లర్‌పేటలో



రజత ఆభరణాలతో వెలుగొందుతున్న గణపతి

నెమలి పింఛాలతో



మయూరశిఖలతో ఏకదంతుడు

పటేల్‌నగర్‌లో



జగన్నాథుడి అలంకారంలో గజాననుడు



గణేశ్‌కాలనీలో విశేషాలంకారంతో వరసిద్ధి వినాయకుడు

సిరుగుప్పలో..



సూర్యకాంతి గణేశుడు



కౌల్‌బజార్‌లో వినాయకుడికి విశేషాలంకారం



పరమేశ్వరుడి రూపంలో ...



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన గణాధ్యక్షుడు



కంప్లి కొత్త బస్టాండు వద్ద పూజలందుకుంటున్న మూషికవాహనుడు



తోరణగల్లులో..

విఘ్నవినాయకుడి పండుగను బళ్లారిలో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలో, కంప్లిలో, సిరుగుప్పలో, తోరణగల్లులో వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. నగరంలోని వివిధ కాలనీల్లో సుమారు 500కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు ఎంపీ భూమిపూజ

తోరణగల్లు, సెప్టెంబరు 8 : గత రెండు రోజులుగా బళ్లారి ఎంపీ తుకారామ్ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సండూరు తాలుకా అగ్రహార గ్రామంలో డీఎంఎఫ్ అనుసంధానంతో రూ. 75 లక్షల వ్యయంలో నిర్మించిన కట్టడాన్ని ప్రారంభించారు. అలాగే చందూరు తాలుకాలోని సువ్వినహళ్లి గ్రామం నుంచి సూర్యపుహళ్లి వరకు సుమారు రూ. 6 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. అలాగే గొల్లరహట్టి గ్రామంలో నిర్మిస్తున్న ఈరన్న పంపన్న దేవస్థాన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. తాలుకాలోని వడ్డీలు కట్టి క్రాస్ దగ్గర కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి పాఠశాల సమీపంలో నిర్మించిన బస్టాండును ప్రారంభించారు. వడ్డెరహళ్లి గ్రామం నుండి రామదుర్గం రోడ్డు నిర్మాణానికి వడ్డెరహళ్లి క్రాస్‌లో నిర్మిస్తున్న నూతన బస్టాండ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



నూతన బస్టాండును ప్రారంభిస్తున్న ఎంపీ తుకారామ్

గృహ వినాయకుల నిమజ్జనం



వినాయకుడిని కాలువలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8: నగరంలోని ఇండ్లలో పూజలు నిర్వహించిన విగ్రహాలను శనివారం తుంగభద్ర కుడి ఉపకాలువలో నిమజ్జనం చేశారు. ఇంటి నుంచి పూజలు చేసి తీసుకొచ్చిన విగ్రహాలను కాలువ గట్టుపై ఉంచి మళ్ళీ పూజలు చేసి నీళ్లలో నిమజ్జనం చేశారు. కొందరూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని తాళూరు రోడ్డులో రద్దీని నియంత్రించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదోరోజు బుధవారం సార్వత్రిక వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం జరగనుంది.

ఆయకట్టులో విస్తారంగా పంటల సాగు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8: బళ్లారి జిల్లాలో ఈసారి వర్షాలు బాగా కురువడంతో వర్షాధారం కింద భూముల్లో చాలా మంది పొద్దుతిరుగుడు పంటను వేశారు. పంటలు బాగా ఉండటంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. సిరుగుప్ప తాలూకాలో వరి బదులుగా పొద్దుతిరుగుడును సాగు చేసిన కొందరు రైతులు మార్కెట్‌లో మంచి ధర వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. తాలూకాలోని బలకుంది. గోనబాలు, అరలిగనూరు, పొప్పనాలు తదితర గ్రామాల్లో పొద్దుతిరుగుడు సాగుచేశారు.



కళకళలాడుతున్న పొద్దుతిరుగుడు పంట



వరినాట్లలో నిమగ్నమైన మహిళలు

ఈఏడాది వంటనూనె ధరలు ఆకాశాన్నంటడంతో రైతులు పండించిన పొద్దుతిరుగుడుకు గిరాకీ బాగానే ఉంది. పొద్దుతిరుగుడు క్వింటాల్‌కు రూ. 7వేలకుపైగా పలుకుతోంది. సాధారణంగా ఎకరాకు 5నుండి 10క్వింటాళ్ల పండించే రైతులు ఎకరాకు 5నుంచి 7వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేస్తారు. తుంగభద్ర ఆయకట్టు భూములలో వరినాట్లు జోరుగా వేస్తున్నారు. ఈసారి సంవత్సరం జలాశయం పూర్తిగా నిండడంతో రెండు పంటలకు నీరు లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేశారు.

గంజళ్లి చెరువులో మొసలి ప్రత్యక్షం..!

రాయచూరు సెప్టెంబరు 8: రాయచూరు తాలూకాలోని కృష్ణనది తీర గ్రామం గంజళ్లి చిన్న చెరువులో ఆదివారం ఉదయం భారీ మొసలి ఒకటి ప్రత్యక్షమైంది. ఇటీవల కృష్ణనదికి భారీగా వరద రావడంతో నది నీరు గ్రామ సమీపంలోని పెద్ద చెరువులోకి రాగా అక్కడి నుంచి నీరు సమీపంలో ఉన్న చిన్న చెరువుకు వచ్చి చేరాయి. గ్రామస్థులు మొసలిని చూసిన వెంటనే తీవ్ర భయాందోళనకు గురైయ్యారు. వెంటనే గ్రామస్థులంతా చేరి 8 అడుగుల పొడుగు దాదాపు 2 క్వింటాళ్లకు పైగా బరువుండే మొసలిని నిర్బంధించి అటవి శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు మొసలిని వాహనం ద్వారా జూరాల జలాశయానికి తరలించారు.

హోసూరు జోన్

కాంస్య పతక విజేతకు మంత్రి అభినందనలు



కాంస్య పతకం కైవసం చేసుకున్న నిత్యశ్రీని సన్మానిస్తున్న దృశ్యం

హోసూరు, సెప్టెంబరు 8 : హోసూరుకు చెందిన నిత్యశ్రీ శివన్ పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం దక్కించుకున్న నిత్యశ్రీ శివన్‌ను తమిళనాడు క్రీడా మంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైల్లో అభినందించారు. ఆ తర్వాత ఆదివారం హోసూరు కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక స్వయంగా నిత్రశ్రీ ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి అభినందించారు. అనంతరం నిత్యశ్రీ ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతూ దేశం కోసం ఇలాంటి ఆటలో పాల్గొనడం కొనసాగిస్తానని తెలిపారు. తదుపరి ఒలింపిక్స్‌ల్లో బంగారు పతకం సాధిండమే తన లక్ష్యమని తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం



హోసూరు, సెప్టెంబరు 8:హోసూరు అగ్రహారం ప్రాంతంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది, భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. హిందు ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆలయం గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరి పునర్నిర్మాణం జరిగింది. ఆలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని వినాయకచతుర్థి రోజున ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పవిత్ర జలంతో కూడిన కుంభాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతర వేదపండితులు వేద మంత్రోచ్ఛారణలు చేస్తూ పూర్ణ కుంభ కలశాలను తలపై ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీనిని అనుసరించి భక్తులందరి తలపై పవిత్ర జలం ప్రోక్షణ చేశారు. మూలవిరాట్‌కు మహా మంగళారతి చేశారు. ఈ కార్యక్రమంల్లో అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొనిస్వామికి పూజలు చేసుకున్నారు.

హ్యాండ్ బ్యాగ్‌ను సొంతదారులకు అప్పగించిన రైల్వే పోలీసులు

హోసూరు(క్రైం) సెప్టెంబరు 8: హోసూరు రైల్వే స్టేషన్‌లో ముంబైకి చెందిన ఓ జంట బంగారు ఆభరణాలతో కూడిన హ్యాండ్‌బ్యాగ్‌ను పోగొట్టుకోగా వాటిని వెతికి తిరిగి వారికి పోలీసులు అప్పగించారు. ముంబైకి చెందిన దేవానంద్ చవాన్.. భార్యతో కలిసి ముంబై నుంచి హోసూరుకు లోకమాన్య తిలక్-కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణిస్తున్నారు. హోసూరు రైల్వేస్టేషన్‌ల్లో రైలు దిగగానే భార్య హ్యాండ్‌బ్యాగ్‌ను రైల్లోనే మరిచిపోయారు. రైల్వే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ శరవణన్, పెట్రోలింగ్‌లో ఉన్న ఫస్ట్‌లెవల్ కానిస్టేబుల్ చెన్నకేశవన్ హ్యాండ్ బ్యాగ్‌ని వెతికి ధర్మపురి రైల్వేస్టేషన్‌లో బ్యాగ్‌ను, అందులో ఉన్న నగలను సొంతదారులకు అందజేశారు.



సొంతదారులకు బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

వినాయక ఊరేగింపులో అపశ్రుతి

●సింధనూరు త్రిమైల్ క్యాంప్‌లో వ్యక్తి హత్య..!

రాయచూరు సెప్టెంబరు 8 : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం ఉదయం ప్రతిష్ఠించిన విగ్రహాన్ని రాత్రి నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా ఈ దారుణం చోటు చేసుకుంది. సింధనూరు తాలూకాలోని త్రిమైల్ క్యాంప్‌లో గణేశ్ ఉత్సవాల సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అదే రోజు రాత్రి నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో వినియోగిస్తున్న డీజేల సౌండ్ అతి పెద్దగా ఉండడంతో సౌండ్ తగ్గించాలంటూ క్యాంప్‌కు చెందిన వీరబస్సప్ప(60) కోరగా యువకులు తీవ్ర ఆగ్రహానికి గురై ఆయనపై దాడికి దిగారు. రాడ్‌లు, కట్టెలతో దాడి చేయడంతో వీరబస్సప్ప తీవ్రంగా గాయపడగా ఆయనను చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఆస్పత్రికి వెళుతుండగానే ఆయన మార్గమధ్యలోనే తదిశ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గొడవలు జరగకుండా బందోబస్త్ ఏర్పాటు చేశారు. శవాన్ని పోస్టుమార్టం కోసం సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా దాడికి బాధ్యులుగా భావించిన మహేశ్, పరశు,మంజులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి సింధనూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



వీరబస్సప్ప(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సుడ్రైవర్ మృతి

●ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు




నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు

రాయచూరు సెప్టెంబరు 8 : జిల్లాలోని సింధనూరు నగర సమీపంలో ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సు డ్రైవర్ మృత్యువాతపడ్డారు. బెంగళూరు నుంచి యాదగిరికి వెళుతున్న ఆర్టీసీ బస్సు సింధనూరు సమీపంలోని హొరాపూర్ వద్ద ఆగింది. ఆ సమయంలో వేగంగా వెనక నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో ఆర్టీసీ బస్సు రోడ్డు కిందివైపు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రెండు బస్సులు తీవ్రంగా నుజ్జునుజ్జు కాగా ప్రైవేటు బస్సు డ్రైవర్ పుండలిక(37) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక ప్రయాణీకుడికి చేయి విరగగా మరో ఐదు గురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తుర్విహాళ్ పోలీసులు సంఘటన స్థళానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతి చెందిన డ్రైవర్ శవాన్ని సింధనూరు తాలూకా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

లియో టాల్‌స్టాయ్ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత, నవలాకారుడు లియో టాల్‌స్టాయ్ 1828 సెప్టెంబరు 9న జన్మించారు. సోవియెట్ యూనియన్ రష్యాకు చెందిన ఆయన ప్రపంచ ప్రసిద్ధి చెందారు. 1902 నుంచి 1906 వరకు ప్రతి సంవత్సరం సాహిత్యంలో నోబెల్ బహుమతి కోసం ప్రతిపాదించారు. ఆ తర్వాత కూడా ప్రతిపాదించినా వివాదాల కారణంగా బహుమతి రాలేదు. వార్ అండ్ పీస్, అన్నా కరెనీనా నవలలు ఎంతో పేరొందాయి. 1910 నవంబరు 20న కన్నుమూశారు.

కాళోజీ నారాయణరావు (జయంతి)



తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వనిగా పేరొందిన 'పద్మవిభూషణ్' గ్రహీత కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబరు 9న కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా రట్టిహళ్ళిలో జన్మించారు. సాంఘిక, రాజకీయ చైతన్యాల సమాహారం. కవిత్వం రాసిన ప్రజా కవి. హక్కులు అడిగిన ప్రజల మనిషి. ఉద్యమం నడిపిన ప్రజావాది. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం పట్టాడు. స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన పుట్టినరోజును తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించింది. పలు పురస్కారాలు అందుకున్నారు. 2002 నవంబరు 13న పరమపదించారు.

వేదాంతం సత్యనారాయణ శర్మ (జయంతి)



వేదాంతం సత్యనారాయణ శర్మ 1935 సెప్టెంబరు 9న కృష్ణా జిల్లా కూచిపూడిలో జన్మించారు. రంగస్థల నటుడు, కూచిపూడి నృత్య కళాకారుడు. సత్యభామ, ఉష, దేవాదేవి, విశ్వమోహినీ పాత్రలను అమోఘంగా పోషించారు. తొమ్మిదేళ్లకే కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. స్త్రీ పాత్రల్లోనూ వివిధ వేషాలు కడుతూ వారితో అంచెలంచెలుగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. నవరసాలు రంగస్థలంపై అలవోకగా పండించగల దిట్ట. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు, కాళిదాస్ సమ్మాన్ తదితర అవార్డులు పొందారు. 2012 నవంబరు 15న కన్నుమూశారు.

అక్షయ్‌కుమార్ (పుట్టినరోజు)



ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ 1967 సెప్టెంబరు 9న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జన్మించారు. నిర్మాత, మార్షల్ ఆర్ట్స్ కళాకారుడు. అసలు పేరు రాజీవ్ హరి ఓం భాటియా. దాదాపు వంద సినిమాల్లో నటించారు. రెండు సార్లు ఫిలింఫేర్ అవార్డు, ఇంకా పద్మశ్రీ పురస్కారం పొందారు. 2015లో ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే నటుల జాబితాలో 9వ స్థానంలో నిలిచారు. నటి ట్వింకిల్ ఖన్నాను పెళ్లి చేసుకున్నారు. సామాజిక సేవలోనూ రాణిస్తున్నారు.


వాడవాడలా కొలువుదీరిన వినాయకులు



బాగేపల్లి పట్టణంలో కొలువుదీరిన గణనాథుడు..



శిడ్లఘట్టలో కుడుములతో అలంకరణ



జయనగర్ గుట్టెపాళ్యలో...



హొంగసంద్రలో శేషపడగ వినాయకుడు

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని ఇంటింటా సహా వాడవాడలా గణనాథులు కొలువుదీరారు. స్థానిక యువజన సంఘాలు, మిత్ర సంఘాలు ఇతర స్వచ్ఛంద సంస్థలు స్థానికంగా మండపాలను ఏర్పాటు చేసి వినాయకులను ఏర్పాటు చేశారు. శనివారం కొలువుదీర్చిన గణనాథులు కొన్నిచోట్ల సాయంత్రానికే నిమజ్జనం చేయగా చాలావరకు 3, 5, 7 రోజులపాటు కొనసాగిస్తున్నారు. నగరంలో నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జనానికి అవకాశం కల్పించారు. చాలావరకు ప్రత్యేకంగా స్పెషల్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి స్థానికంగా ఇళ్లలో కొలువు దీర్చిన వినాయక విగ్రహాలను స్వీకరించారు. ఇలా గరిష్టంగా 2 అడుగుల వరకు తీసుకుంటున్నారు. అంతకంటే పెద్ద విగ్రహాలైతే సూచించిన చెరువుల ప్రదేశంలో బీబీఎంపీ సిబ్బంది సహకారంతో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. చెరువులలో కూడా మొత్తం చెరువు ప్రదేశాన్ని కాకుండా నిర్దేశించిన స్థలంలో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు చేపట్టారు.

విజయనగర్: హొసగుడదహళ్ళి నుంచి శివాజినగర్‌కు కొత్త బస్సు సర్వీసులను వసతి, వక్ఫ్‌బోర్డు శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పచ్చజెండా చూపారు. అంతకుముందు వినాయక నగర్‌లో ఏర్పాటైన ఉత్సవాల్లో పాల్గొన్నారు.

మహదేవపుర: కుందలహళ్ళి ఏఈసీఎస్ లే అవుట్‌లోని గురు కేపీఆర్ నేతృత్వంలో గణేశ ఉత్సవాన్ని నిర్వహించారు. రిపబ్లికన్ యూత్ అసోసియేషన్, వినాయక గెళెయర బళగ ఆధ్వర్యంలో 27వ వార్షిక ఉత్సవం జరిగింది. భరతనాట్యం, సంగీత కార్యక్రమాలకు భక్తులు పరవశులయ్యారు.

బాగేపల్లి: వారియర్స్ గణేశ యువజనసంఘం ఆధ్వర్యంలో గౌరి-గణేశ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజుల కార్యక్రమాల్లో ప్రతిరోజూ సంగీత కార్యక్రమం, సాయంత్రం భజన, రంగవల్లుల పోటీలు, సామూహిక నృత్యం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



హలసూరు చెరువులో నిమజ్జనం ఇలా..

చేళూరు: తాలూకా పరిధిలోని ఇంటింటా వినాయక చవితి పండుగ సంబరంగా సాగింది. ప్రముఖ కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి పూజలు కొనసాగించారు. గతంతో పోలిస్తే ఈసారి మట్టివినాయకుల ప్రాధాన్యత పెరగడం విశేషం.

శిడ్లఘట్ట: తాలూకా వ్యాప్తంగా వినాయకచవితి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. శ్రీరామభజనామందిరం గెళెయర బళగ ఆధ్వర్యంలో 17వ వార్షిక గణేశ ఉత్సవం సందడిగా సాగింది. మళమాచన హళ్ళిలోని శ్రీరామభజన మందిరం బృందంచే ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు సాగాయి.

బొమ్మనహళ్ళి: నియోజకవర్గంలోని హెచ్‌ఎస్ఆర్ లే అవుట్, బొమ్మనహళ్ళి, హొంగసంద్ర తదితర ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. హెచ్‌ఎస్ఆర్ లే అవుట్ అగర పరిధిలో సుమారు 25 అడుగుల ఎత్తైన వినాయకుడిని కొలువుదీర్చారు. పూజల్లో హెచ్‌ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు. బేగూరు రోడ్డులోని ప్రముఖ వినాయక ఆలయంలో గణనాథుడిని ప్రత్యేకంగా కొలువుదీర్చారు. హొంగసంద్ర లో భారీ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బంగారపేట: ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్టు ఎమ్మెల్యే, కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్, మెడికల్ సర్కిల్‌లో మిత్రమండలి, వర్తకుల సంఘం ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక యువకులు పూర్వీకుల సంప్రదాయాల మాదిరిగా పండుగ ఆచరిస్తున్నారని ఎమ్మెల్యే అభినందించారు.



బొమ్మనహళ్లిలో చిన్నారుల నృత్య ప్రదర్శన





దొడ్డగణేశ ఆలయం.. కాటన్‌పేటలో వినాయకుడు ఇలా..



బంగారపేటలో ఎమ్మెల్యేకు సన్మానం



విశ్వంభర గణపతికి చిన్నారుల పూజలు



వినాయకనగర్ పూజల్లో మంత్రి జమీర్ ఖాన్



ఏఈసీఎస్ లే అవుట్‌లో వినాయకుడికి పూజలు



శిడ్లఘట్ట తాలూకాలో మొక్కలు పంపిణీ

అత్యాధునిక కిచెన్ వస్తువులు లక్ష్యం

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక కిచెన్‌కు అనుగుణంగా వస్తువులు సమకూర్చడం తమ లక్ష్యమని యూనాక్స్ ఇండియా సంస్థ ఎండీ విక్రమ్ గోయెల్ అభిప్రాయపడ్డారు. ఓవెన్‌లలో ప్రీమియం ఇటాలియన్ బ్రాండ్ యూనాక్స్ నగరంలో ప్రత్యేక లాంజ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా విక్రమ్ గోయెల్ మాట్లాడుతూ చెఫ్‌లు, వంట నిపుణులు యూనాక్స్ ఉత్పత్తుల పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. యూనిక్‌స్టీల్ ప్రోడక్ట్స్ ద్వారా ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్‌లో ఉన్నామన్నారు. బెంగళూరులో లాంజ్ ఏర్పాటుకు ప్రధాన కారణం భిన్నమైన సంస్కృతి, దేశ విదేశీయులు నివసిస్తున్న నగరం కావడంతో ఏర్పాటు చేశామన్నారు. సంస్థ డైరెక్టర్ మార్ట్ రాబర్ట్, హుజేఫా మద్రాస్‌వాలాలు మాట్లాడుతూ వంటల ఆవిష్కరణ కేంద్రాలుగా ఉండే హై ఎండ్ రెస్టారెంట్‌లు, లగ్జరీ హోటళ్లు, స్టైలిష్ కెఫెలు, డైనమిక్ కేటరింగ్‌లతోపాటు అన్ని వర్గాలకు యూనాక్స్ వస్తువులను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

ఎలక్ట్రికల్ వెహికల్స్‌కు రెవ్‌ఫిన్ రుణసాయం

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సన్ మొబిలిటీ ప్లాట్‌ఫాం ద్వారా కార్యాచరణ సాగిస్తున్న రెవ్‌ఫిన్ సంస్థ ఎలక్ట్రికల్ వెహికల్స్‌కు రుణసాయం అందించేందుకు సిద్ధమని ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ ఫౌండర్ సీఈఓ సమీర్ అగర్వాల్, సన్ మొబిలిటీ సీఈఓ అనంత్‌బడ్జాత్యాలు బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 15వేల వాహనాలకు రుణసాయం అందించదలిచామన్నారు. ఇప్పటికే వివిధ ప్రధాన నగరాలలో సేవలు అందిస్తున్నామని, బెంగళూరులోనూ విస్తరించదలిచామన్నారు. కనీసం రూ.100కోట్లు రుణసాయం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫ్లీట్ ఆపరేటర్‌ల ద్వారా సేవలను అన్ని ప్రాంతాల్లో కొనసాగించదలిచామన్నారు. రెవ్‌ఫిన్ వివిధ కంపెనీలతో భాగస్వామ్యం కొనసాగిస్తోందన్నారు. గడిచిన ఆరు నెలల్లో 65వేల వాహనాలకు రుణసాయం అందించామన్నారు.

రైలు నుంచి పడి వృద్ధుడి మృతి

గుత్తి, సెప్టెంబరు 8: గుత్తి జీఆర్పీ పరిధిలోని పాత కొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి కింద పడి సాంబయ్య(73)అనే వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఆదివారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి పట్టణానికి చెందిన సాంబయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి రైల్లో తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం రైలు పాతకొత్తచెరువు స్టేషన్ సమీపంలోకి రాగానే సాంబయ్య వాష్‌రూంకు వెళ్లి వచ్చే సమయంలో ప్రమాదవశాత్తూ జారి కింద పడి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంబమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సినిమా నటులను ఆదర్శంగా తీసుకుంటారని అందుకే వారు మార్గదర్శకంగా ఉండాలంటారు. బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నటుడు దర్శన్‌కు భార్య ఉన్నా ప్రియురాలు కూడా ఉన్నారని నేనూ అలాగే అంటూ వేధింపులకు గురి చేస్తున్న భర్త నిర్వాకం భరించలేక భార్య ఆత్మహత్యకు పాల్పడింది. హుళిమావు సమీపంలోని అక్షయ్‌నగర్‌లో అనూష (26), రెండు రోజులక్రిందట ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్ర గాయాలు కావడంతో విక్టోరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం కన్నుమూశారు. అనూషకు ఐదేళ్లక్రితం శ్రీహరితో వివాహమైంది. వారికి రెండేళ్ల చిన్నారి ఉంది. శ్రీహరి మరో మహిళతో వివాహేతరసంబంధం కలిగి ఉన్నాడు. ఇదే విషయమై భార్యాభర్తలమధ్య గొడవ జరగగా నాకూ దర్శన్ తరహాలోనే ప్రియురాలు ముఖ్యమేనని వాదించాడు. అనూష బాత్రూంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. గాయాలు భరించలేక కేకలు వేయడం, మంటలు చెలరేగడంతో వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు రక్షించే యత్నం చేశారు. అయితే అప్పటికే దాదాపు కాలిపోయారు. విక్టోరియా ఆసుపత్రికి చేర్పించగా చికిత్సలు ఫలించక కన్నుమూశారు. అనూష తండ్రి హేమంత్ తెలిపిన మేరకు మూడు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగాయన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించినా సంసారం సమస్య పోలీస్ స్టేషన్‌దాకా వెళ్తే కష్టమవుతుందని వెనుకడుగు వేసిందన్నారు. వాష్‌రూం నుంచే భర్తకు వీడియోకాల్ చేసి దారుణానికి పాల్పడి ఉందని, ఇంట్లోనే భర్త ఉన్నా సకాలంలో స్పందించలేదన్నారు. కొన్ని నెలలుగా అనూషను చిత్రహింసలకు గురిచేశారని మండిపడ్డారు. హుళిమావు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



అనూష (ఫైల్)

వృద్ధుల సంరక్షణ మన బాధ్యత

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వయసు పైబడిందని వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారి సంరక్షణను మనం బాధ్యతగా తీసుకోవాలని లైఫ్‌బ్రిడ్జ్ సీనియర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపకులలో ఒకరైన రాజగోపాల్ అభిప్రాయపడ్డారు. నగరంలోని కనకపుర రోడ్డులో కొత్తగా జెరియాట్రిక్ కేర్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. శస్త్ర చికిత్స అనంతరం రోగులు కోలుకునేందుకు వృద్ధుల ప్రేమాభిమానాలు, వ్యక్తిగత శ్రద్ధ ఎంతో ఊరటనిస్తాయన్నారు. వ్యక్తిగత పునరావాసం, నొప్పుల నివారణపై కేంద్రీకరించేలా విశ్రాంతి కేంద్రం ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో 82 పడకలతో కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, టెర్రేస్ లాన్ కూడా ఉందన్నారు. ఫిజియోథెరపీ సదుపాయం, నిరంతర వైద్య సేవలు ఉన్నాయన్నారు. సీఓఓ డాక్టర్ రీమానాడిగ్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కేర్ రంగంలో ముందంజలో ఉన్నామన్నారు.

మురిసిన అనంత..

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అభిమానుల్లో ఆనందం.. శ్రేయాస్ సేనపై రుతురాజ్ టీం గెలుపు.. మానవ్‌సుతార్ ఆల్‌రౌండ్ షో

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అనంత మురిసింది. స్టార్ల సందడితో అభిమానుల్లో ఆనందం ఉప్పొంగింది. తొలి మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు గెలుపొందింది. ఒకరోజు మిగిలివుండగానే మ్యాచ్ ముగిసింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మానవ్‌సుతార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మొదటి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైన ఇండియా డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 236 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 54 పరుగులు, దేవ్‌దత్ పడిక్కల్ 56, రికీ భుయ్ 44 రాణించారు. మిగతా బ్యాట్స్‌మెన్ నిరాశపరిచారు. మొదటి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్న అక్షర్ పటేల్ రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులకే ఔటయ్యాడు. ఇండియా సీ బౌలర్లలో మానవ్‌సుతార్ 7, వైశాక్ 2, అన్షుల్ కాంబోజ్ వికెట్ తీశారు.

రెండో ఇన్నింగ్స్‌లో రాణించిన ఇండియా సీ జట్టు

మొదటి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే ఆలౌటైన ఇండియా సీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ 46 పరుగులు, ఆర్యన్ జ్యూయెల్ 47, పటీదార్ 44, అభిషేక్ పోరెల్ 35, మానవ్‌సుతార్ 19 రాణించారు. దీంతో నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. ఇండియా డీ బౌలర్లలో శరాన్ష్ జైన్ 4 వికెట్లు, అర్షదీప్‌సింగ్, అక్షర్‌పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశానికి కెప్టెన్లు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారి స్థానంలో ప్లేయర్లు మాట్లాడారు. కాగా ఇద్దరు కానిస్టేబుళ్ల ఓవరాక్షన్‌తో మ్యాచ్‌ను వీక్షించేందుకు వెళ్తున్న వీఐపీలు ఇబ్బందిపడ్డారు. ఇతర పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కబెట్టారు.

అభిమానుల సందడి

భారత ఆటగాళ్ల ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. దీంతో ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. స్టార్ ప్లేయర్లను తమ కెమెరాల్లో బంధించారు. బీసీసీఐ ప్రతినిధి అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛోపెర్రర్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ వసంతబాబు, పగడాల మల్లికార్జున, మెడికల్ టీం డాక్టర్ సుప్రజాచౌదరి తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు.



మ్యాచ్‌లోని ఓ దృశ్యం



కిక్కిరిసిన ఆర్డీటీ స్టేడియం

ఏపీఎంసీ మార్కెట్‌లో రూ.5లక్షల చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

చింతామణి, సెప్టెంబరు 8: చింతామణి పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌లోని ఓ దుకాణం క్యాష్‌టేబుల్‌లో ఉంచిన రూ.5లక్షల నగదును దుండగులు క్షణాల్లో చోరీ చేసి పరారయ్యారు. ఆదివారం ఉదయం చోరీ చోటు చేసుకుంది. పట్టణంలోని చేళూరు రోడ్డులో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లోని కైలాస ట్రేడర్స్ దుకాణం ఎంఎల్ రామకృష్ణప్ప ఆదివారం సంత కావడంతో సాధారణంకంటే ఎక్కువగా బియ్యం కొనుగోళ్లకు వచ్చారు. ఇలా ఇద్దరు ముగ్గురికి బియ్యం బస్తాలను విక్రయించిన అనంతరం పక్క దుకాణంలో తనకు అవసరమైన బియ్యం రకం కోసం వెళ్లి వచ్చేలోగా దుండగులు తమ చేతివాటాన్ని ప్రదర్శించి క్యాష్‌టేబుల్ డోర్‌ను పగులగొట్టి రూ.5లక్షలతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సిఐ విజికుమార్ కేసు నమోదు చేసుకోగా క్లూస్‌టీమ్, శ్వానదళంతో దర్యాప్తు చేపట్టారు.

మహాసమాధిని దర్శించుకున్న మాజీ క్రికెటర్లు

పుట్టపర్తి, సెప్టెంబరు 8: మాజీ క్రికెటర్లు చేతన్‌శర్మ, అజయ్‌మల్హోత్రా, బీసీసీఐ మేనేజర్ అమిత్‌సిద్దేశ్వర్, రంజీ మాజీ క్రికెటర్ షాబుద్దీన్ ఆదివారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వినాయకచవితి సందర్భంగా ప్రశాంతినిలయం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు విజయ్ వారికి సత్యసాయి చిత్రపటాలను అందజేసి, సన్మానించారు.

నేడు అనంతకు రానున్న క్రికెట్ జట్లు

దులీప్‌ట్రోఫీలో భాగంగా సోమవారం ఇండియా-ఏ, ఇండియా-బీ జట్లు జిల్లాకు రానున్నాయి. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం బస చేయనున్నారు. మంగళవారం ఇరు జట్లు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొననున్నాయి. ఈనెల 15 నుంచి ఏసీజీ-ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా-డీ జట్ల మధ్య పోటీ జరగనుంది. ఏసీజీ-బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.